క్లుప్తంగా

పాతమల్లాయపాలెంలో భారీ అన్నసంతర్పణ



పాతమల్లాయపాలెం (ప్రత్తిపాడు): మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో పెద్ద ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. స్థానిక శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాయలంలో ప్రతి ఏటా కార్తీక మాసంలో భారీగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఎప్పటిలానే బుధవారం గ్రామంలో అన్నసంతర్పణ నిర్వహించారు. ప్రత్తిపాడుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు వేల సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. సుమారు ఇరవై మంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రసన్నాంజనేయ స్వామికి అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ విశేష పూజలు, ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని సీపీఐ కార్యాలయంలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు నూతన దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందరి ఆనందం సామాజిక సేవా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వాహకులు సోమేపల్లి వీరాంజనేయులు, సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఆర్.ఆదేశ్వరరావు దాతల సహకారంతో సమకూర్చిన వస్త్రాలను కార్మికులకు అందించారు. కార్యక్రమంలో అంకమ్మరావు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం



పొన్నూరు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పొన్నూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో నిడుబ్రోలు మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కె.శ్రీనివాస రెడ్డి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ చక్రవర్తి పాఠశాలకు చెందిన వంద మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేసి సమస్యలపై పిల్లలకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు బ్రష్, పేస్ట్, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఆర్ఐ శ్రీనివాస్, రెడ్ క్రాస్ చైర్మన్ వీవీ గుప్తా, ట్రెజరర్ కె. ఆంజనేయులు, సభ్యులు ననపనేని బాలకృష్ణ, తోట భాను ప్రసాద్, కోట వెంకటేశ్వర్లు, పి.గణేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అమానుల్లా పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర



చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బుధవారం వడ్లమూడి సంగం డెయిరీని సందర్శించారు. విజ్ఞాన యాత్రలో భాగంగా విద్యార్థులను తీసుకెళ్లినట్లు హెచ్ఎం ఎం.ఏడుకొండలు తెలిపారు. 180 మంది ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వటం జరిగిందని హెచ్ఎం తెలిపారు. ఉపాధ్యాయులు ఏ దుర్గాబాయి, కోటి పద్మ, సీహెచ్ నాగేశ్వరరావు, ఉమామహేశ్వరి, రవీంద్ర బాబు పాల్గొన్నారు.

రేపు లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం



గుంటూరు రూరల్: నల్లపాడు వెంగళాయపాలెం రోడ్డులోని స్వయంభూ పుష్పాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 4 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ, 5 గంటలకు కోటి దీపోత్సవం, కార్తీక వన సమారాధన జరుగుతుందన్నారు.

అన్నదాతల గుండెల్లో గుబులు

వాతవరణ హెచ్చరికలతో ఆందోళన
- ముమ్మర వ్యవసాయ పనుల్లో రైతాంగం
- పెరిగిన యంత్రాల వినియోగం
- రైతులకు దక్కని ధాన్యం మద్దతు ధర
- రబీ సాగుపై రైతుల ఆశలు



ధాన్యంను కుప్పగా పోస్తున్న హార్వెస్ట్ యంత్రం

చేబ్రోలు: మబ్బులతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే దశలో ఉంది. ఆకాశం మబ్బులతో రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు కలవరపరిచాయి. ఏతావాతా పంటను కాపాడుకున్న రైతులకు దిక్కుతోచడం లేదు.

ఖరీఫ్ సాగు ఇలా..

చేబ్రోలు మండలంలో ఈ ఏడాది 15 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. చేబ్రోలు, మంచాల, తోట్లపాలెం, శ్రీరంగపురం, వడ్లమూడి, నారాకోడూరు తదితర గ్రామాల్లో వరి పంట కోతకు వచ్చింది. ప్రస్తుతం తుఫాన్ ప్రభావం హెచ్చరికలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. వారం రోజులుగా వ్యవసాయ పనులు చేపట్టారు. మరో పది రోజుల పాటు వాతవరణ పరిస్థితులు అనుకూలిస్తే రైతుల కష్టానికి ఫలితం దక్కుతుంది. ఈ ఏడాది ఎకరానికి 40 నుంచి 45 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కానీ ప్రస్తుతం ఎకరానికి 30 నుంచి 35 బస్తాల వరకు మాత్రమే దిగుబడి వస్తుంది.

యంత్రాలతో కోతలు..

వాతవరణ పరిస్థితుల హెచ్చరికలతో కోతలకు అనుకూలంగా ఉన్న రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వరి కోతలు కోసి కుప్పలు వేసే సంప్రదాయానికి రైతులు ఆసక్తి చూపటం లేదు. కూలీల కొరత, తక్కువ ఖర్చుతో పంట ఇంటికి వస్తుండటంతో రైతులు యంత్రాల వాడకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. హార్వెస్ట్ యంత్రాల వినియోగంతో తక్కువ ఖర్చుతో పనులు పూర్తి చేస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన యంత్రాలను రైతాంగం వరికోతలు, నూర్పిళ్లకు ఉపయోగిస్తున్నారు. ఒకే సారి కోత, నూర్పిడి పూర్తి అవుతుండటంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు.

కూలీల కొరత అధిగమించి..

హార్వెస్ట్ యంత్ర వినియోగానికి గంటకు మూడు వేల వరకు ఖర్చు అవుతుంది. నేలవాలిన పైరుకు రెండున్నర నుంచి మూడు గంటలు సమయం పడుతుండగా, బాగున్న పొలాలు గంటన్నరలోనే పంట ఇంటికి చేరుతోంది. హార్వెస్ట్ ద్వారా ధాన్యం చేతికి వస్తుండటంతో సమయం, తక్కువ ఖర్చుతో పనులు పూర్తి అవుతున్నాయి. అదే కూలీలతో పనులు చేపడితే వరి కోతకు నాలుగు నుంచి ఐదు వేలు, ఒడెలు తిప్పటం, కుప్పలు వేయటానికి ఆరు వేలు, కుప్ప నూర్పిడికి ఆరువేలు ఖర్చు అవుతుంది. యంత్రాల ద్వారా అయితే ఈ ఖర్చులు తగ్గుతుండటంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. యంత్రాల వాడకం వల్ల వ్యవసాయ పనులు ప్రస్తుతం పదిరోజులకే పూర్తయ్యే పరిస్థితి కనిపిస్తుంది.

దక్కని ధాన్యం మద్దతు ధర..

ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రైతుల నుంచి 75 కిలోల ధాన్యం బస్తా రూ.1400 నుంచి రూ.1450 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర ప్రకారం బస్తా రూ.1720లకు కొనుగోలు చేయాల్సి ఉంది. చేబ్రోలు మండలంలో నేటి వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా ఒక్క బస్తా కూడా రైతుల నుంచి కొనుగోలు చేయలేదు. వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నప్పటికి నేటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కూడా జరగలేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే మూడు నుంచి నాలుగు వందలు తక్కువగా వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోతకు సిద్ధంగా వరి పొలం



వరికోతలు కోస్తున్న రైతులు

రబీలో అపరాల సాగుపై రైతుల ఆసక్తి

చేబ్రోలు మండలంలో ఎక్కవ మంది రైతులు రబీలో అపరాల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. గత కొన్నేళ్లుగా జొన్న పంటలను సాగు చేస్తున్న రైతులు ప్రస్తుత వాతవరణ పరిస్థితుల్లో అపరాలు సాగు చేసుకోవాలని అధికారులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. దీంతో పాటు పంట మార్పిడి కూడా మంచి ఫలితాన్ని ఇస్తుందని రైతులు భావిస్తున్నారు. మినుము, పెసర పంటలకు మార్కెట్లో మంచి ధర ఉండటం కూడా రైతులు అపరాలు సాగు పట్ల మొగ్గు చూపటానికి కారణంగా తెలుస్తుంది.

అధైర్యపడకండి అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



ప్రత్తిపాడు: అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడు మండలం మేడావారిపాలెంలో ఇటీవల ప్రమాదవశాత్తూ మరణించిన సజ్జా గోపి కుటుంబ సభ్యులను బుధవారం కిరణ్‌కుమార్ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. మనోధైర్యంతో ముందుకు సాగాలని, పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు సూచించారు.

పన్ను బకాయిలపై దృష్టి సారించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, నీటి పన్ను బకాయిల వసూలుపై అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో డెప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లతో కలసి ఆస్తి, ఖాళీ స్థల పన్ను, నీటి మీటర్ల చార్జీల వసూళ్ల వేగవంతంపై బుధవారం సమావేశం నిర్వహించారు. తొలుత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా పన్నుల వసూలుపై సమీక్షించి, లక్ష్యానికి తగిన విధంగా లేవని, రాబోవు రెండు రోజుల్లో వార్డు సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పన్ను వసూలుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని కోరారు. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న అసెస్‌మెంట్ల నుంచి వసూలుకు రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని సూచించారు. మొండి బకాయిదార్ల లిస్టులు సిద్ధం చేయాలని, వారి నుంచి వసూలు చేసే బాధ్యత డెప్యూటీ కమిషనర్లు తీసుకోవాలని, స్పందించని మొండి బకాయిదార్ల నివాసాలకు ట్యాప్, డ్రైనేజీ కనెక్షన్ తొలగించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి పన్నుకూడా పెద్ద మొత్తంలో పెండింగ్ ఉందని, బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వేగవంతం చేయాలని ఆదేశించారు. వార్డు సచివాలయాల వారీగా ప్రతి అసెస్‌మెంట్ తనిఖీ చేసి, అండర్, అన్ అసెస్‌మెంట్లను గుర్తించి, తదుపరి సమావేశం నాటికి డిమాండ్‌లో పురోగతి ఉండాలన్నారు. రెవెన్యూ వసూలులో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, అడ్మిన్ కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు బాలాజీ బాషా, రెహ్మాన్, రవికిరణ్ రెడ్డి, సాదిక్ బాషా పాల్గొన్నారు.

బాల్య వివాహాలు సమాజ రుగ్మత

ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి

ప్రత్తిపాడు: బాల్య వివాహాల వలన మాతాశిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉందని గుంటూరు ఐసీడీఎస్ పీడీ ఎం.ఉమాదేవి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. వార్డు సభ్యుడు డబ్బూరి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పీడీ మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజరుగ్మత అని అన్నారు. దేశం వెనుక బడటానికి కారణం నిరక్షరాస్యత, బాల్య వివాహాలేనని చెప్పారు. బాల్య వివాహాలను నిరోధించడంలో తల్లిదండ్రులతో పాటు సామాజం యొక్క పాత్ర కూడా అనిర్వచనీయమైనదని తెలిపారు. ఇది ఒక్క ఐసీడీఎస్ బాధ్యతగా అనుకోవద్దని అనేక శాఖలు ప్రజలు గ్రామస్తులు అన్ని వర్గాల సహకారంతోనే సాధ్యపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలో 524 బాల్య వివాహాలు జరిగాయని, మరికొన్నింటిని సమర్థంగా అందరి సమష్టి కృషితో అడ్డుకోగలిగామని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో నిబద్ధతతో పని చేస్తూ బాల్య వివాహాల నిరోధానికి ప్రాథమిక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2030 నాటికి బాల్య వివాహాలు తగ్గుముఖం పట్టేలా మనమంతా అడుగులు ముందుకు వేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ వి. సుజాతదేవి, వెలుగు ఏపీఎం వి.లాజరు, సెక్రటరీ షేక్ ఖాజా పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, సీడీపీఓ సుజాతదేవి

- బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌పై యనమదలలో జరిగిన గ్రామసభలో ఎంపీడీఓ కె. శివపార్వతి పాల్గొని ప్రసంగించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. హైస్కూల్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచి ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గొట్టిపాడు పీహెచ్‌సి వైద్యాధికారి మేరీ యునిస్

ప్రత్తిపాడు: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతో ఉందని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి మేరి యునిస్ అన్నారు. మండల పరిధిలోని యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఎత్తు, బరువులతో పాటు రక్త గ్రూప్ నిర్ధారణ, బ్లడ్ పర్సంటేజీ, ఛాతీ పరీక్షలు చేశారు. స్పెషల్ డ్రైవ్‌ను డాక్టర్ మేరియునిస్ ఆకస్మికంగా సందర్శించి ఎత్తు బరువులు సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరియునిస్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అంటువ్యాధులు దరి చేరవన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కె.శివపార్వతి, డాక్టర్ మేరియునిస్ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ నిర్మలాదేవి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారి మేరి యునిస్, ఎంపీడీఓ శివపార్వతి

సిబార్ కళాశాలలో వైట్‌కోట్ వేడుక

పెదకాకాని: మండల పరిధిలోని సిబార్ దంత వైద్య కళాశాలలో బుధవారం బీడీఎస్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు వైట్‌కోట్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ నరసింహం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. వైద్య విద్యార్థిగా ఎదురయ్యే అన్ని సవాళ్లను ఎదుర్కొని సమాజ సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలలో పాల్గొని క్రమశిక్షణ అలవరచుకోవాలని సూచించారు. విద్యార్థులకు వైట్‌కోట్‌ను అందజేశారు. విద్యార్థులతో హిపోక్రటిక్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ వెంకట రమణారెడ్డి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఏజే సాయిశంకర్ పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ నరసింహంను సన్మానిస్తున్న దృశ్యం

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

పొన్నూరు: దాళ్వా పంటలకు బీమా ప్రీమియం డిసెంబరు 15 వరకు చెల్లించి నమోదు చేసుకోవాలని ఏఓ డేగల వెంకట్రామయ్య తెలిపారు. మండలంలోని ఉప్పరపాలెం, సీతారాంపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వెంకట్రామయ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 75 కేజీల ధాన్యం బస్తా ఏ గ్రేడ్ రకం రూ.1740, బీ గ్రేడు రూ.1725 ధర ఇవ్వనున్నట్లు తెలిపారు. ధాన్యం తేమశాతం 17 కంటే తక్కువగా ఉండాలని, నాణ్యత ప్రమాణాలు ఉంటే, గోనె సంచులు, కూలీ, రవాణా ఖర్చులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీతారాంపురం సర్పంచి చుండు పద్మ, ఉప్పరపాలెం, సీతారాంపురం రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేసుకోవాలి

కొండపాటూరు(కాకుమాను): ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని కొండపాటూరు, గార్లపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.



మినుము విత్తన సంచులు పంపిణీ చేస్తున్న అధికారులు

దేశ చరిత్రను మార్చే శక్తి ఒక్క ఓటుతోనే సాధ్యం

జిల్లా స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగరాజు

గుంటూరు రూరల్: దేశ చరిత్రను మార్చేశక్తి ఒక్క ఓటుతోనే సాధ్యమని జిల్లా స్పెషల్ డెప్యూటీ కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ గంగరాజు తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రతి విద్యార్థిని, విద్యార్థులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. సమాజాన్ని మార్చే ఆయుధం ఒక్క ఓటేనని తెలిపారు. తాడికొండ మండల తహసీల్దారు, అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి కె.నాసరయ్య మాట్లాడుతూ చలపతి కళాశాలలో గురువారం బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని 18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి బీఎల్‌ఓల దగ్గర ఆధార్ కార్డు సమర్పించి ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ హక్కులతో పాటు బాధ్యతలు నెరవేర్చాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, డీటీ ఎ.మోహినికుమారి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగరాజు

యువత ఓటును నమోదు చేసుకోవాలి

చేబ్రోలు: వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండుతున్న యువత ఓటరు నమోదు కార్యక్రమంలో తమ ఓటును నమోదు చేసుకోవాలని చేబ్రోలు తహసీల్దారు కే శ్రీనివాసశర్మ కోరారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు శ్రీనివాసశర్మ మాట్లాడుతూ ఓటరు నమోదు గురించి, ఫాం-6, ఫాం-7 గురించి వివరించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసులు, ఆర్ఐ మహమ్మద్ అజీజ్, అధ్యాపకులు ఏడుకొండలరావు, శ్రీరామశేషు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య మనుగడకు యువత ఓటే కీలకం

పెదకాకాని: యువత గత ఎన్నికల్లో 70 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ కే కృష్ణకాంత్ అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టూట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్వీప్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కచ్చితంగా ఓటు హక్కుని నమోదు చేసుకోవాలని యువత ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక భూమిక వహిస్తారని ఆయన అన్నారు. 17 సంవత్సరాలు నిండిన వారు కూడా గత సంవత్సరం నుంచి కాబోయే ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తదనంతరం 18 సంవత్సరాలు నిండగానే ఓటు హక్కును పొందవచ్చని తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చుట్టుపక్కల ఇంట్లో ఓటు హక్కు లేని వారికి ఓటు హక్కుని నమోదు చేసుకునే విధంగా అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భక్త సింగ్ పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో కార్తిక సందడి



ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

గుంటూరు రూరల్: పండుగలు భారతీయ సంస్కృతికి ప్రతీకలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. కార్తిక మాసం సందర్భంగా బుధవారం చౌడవరంలోని కళాశాలలో ఉమెన్స్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో కార్తిక శోభ, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

చెత్త తరలింపు వాహనాల వివరాలు నమోదు..

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పొన్నూరు రోడ్ ఎంఆర్ఎఫ్(మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్)ని సమర్ధంగా నిర్వహించాలని, ప్రత్యేక రిజిస్టర్ ద్వారా చెత్త తరలింపు వాహనాల ట్రిప్‌ల వివరాలు నమోదు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ కొండయ్య కాలని, రాజీవ్ గాంధీ నగర్, శ్యామల నగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. తొలుత ఎంఆర్ఎఫ్ సెంటర్‌ని పరిశీలించి, ప్రతి రోజు ఎన్ని వాహనాల ద్వారా చెత్త వస్తుంది, అక్కడి నుంచి జిందాల్‌కి ఎంత తరలిస్తుంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో డీఈఈలు మధుసూదన్, నాగభూషణం, శ్రీనివాస్, ఆర్వోలు రెహ్మాన్, రవి కిరణ్ రెడ్డి, ఏఈలు రవి కిరణ్, చైతన్య పాల్గొన్నారు.

ఆకుముడత నివారణపై అవగాహన



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరులో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆకుముడత నివారణపై అవగాహన కల్పించారు. వరి సాగులో రోప్ పుల్లింగ్ విధానంతో ఆకుముడత పురుగులను కొంత మేర నివారించవచ్చని తెలిపారు. సమగ్ర సస్య రక్షణ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు ఎలా సాధించాలని, తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ముస్కాన్ కుమారి, గాయత్రి, సాహితి, హ్యాపీ సహజ బృంద, గీతా భవాని, అభినయశ్రీలు పాల్గొన్నారు.